డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR



విలేకరులు కావలెను..

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ *జనం వాయిస్* తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..

సంప్రదించండి: 8121158069



| పెద్దపల్లి Peddapalli | శనివారం Saturday | 21 -02 -2026 21 -02-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 34 Issue: 34 | పేజీలు : 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|


# కవిత పార్టీ టీపీజేపీ ?

- ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీ.
- .తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసిన ట్లుగా సమాచారం.
- కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ.
- పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం.



**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో **మిగతా 2 లో...**




- *జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం.*
- *ఇప్పటివరకు అటు అసెంబ్లీకి కానీ..ఇటు మండలికి కానీ ఎన్నిక కాలేదు.*
- *ఏదో సభకు ఎన్నిక కాకపోతే ఆయన పదవి ఊస్ట్ అవడం పక్కా.*
- *అజారుద్దీన్‌ను పదవీ గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్.*
- *ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యూహాలకు పదును.*

# దేశానికి ప్రత్యేక కృత్రిమ మేధ మండలి అవసరం

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.



- జీఎస్టీ మండలి తరహాలో భారత్ కృత్రిమ మేధ మండలి ఏర్పాటు సూచన.
- జాతీయ కృత్రిమ మేధ నిధి, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ప్రతిపాదన.
- హైదరాబాద్‌ను జాతీయ కృత్రిమ మేధ కార్యాచరణ కేంద్రంగా ఆహ్వానం.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:**

కృత్రిమ మేధ రంగంలో వేగవంతమైన, విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో దేశ స్థాయిలో అత్యున్నత మండలి అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీ మండలి, నీతి ఆయోగ్ తరహాలో "భారత్ కృత్రిమ మేధ మండలి"ని ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఆయన కోరారు. జాతీయ భద్రత, దేశ ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కఠిన చట్టపరమైన రక్షణ చర్యలు రూపొందించేందుకు ప్రత్యేక కృత్రిమ మేధ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కృత్రిమ మేధను సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలనకు శక్తివంతమైన సాధనంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన భారత కృత్రిమ మేధ ప్రభావ సదస్సులో ముఖ్య ప్రసంగం చేస్తూ ఆయన ప్రపంచ నాయకులు, సాంకేతిక నిపుణులను తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. దేశానికి అంకితమైన కృత్రిమ మేధ ప్రారంభ సంస్థల గ్రామాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. వేగంగా మారుతున్న సాంకేతిక యుగంలో సంవత్సరానికి ఒకసారి సమావేశాలు సరిపోవని, దేశంలోని వివిధ నగరాల్లో సంవత్సరానికి రెండుసార్లు కృత్రిమ మేధ సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రారంభ సంస్థలకు మద్దతుగా జాతీయ కృత్రిమ మేధ నిధిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. **మిగతా 2 లో...**



## *నాకు ఐదు నిమిషాలు ఇవ్వగలరా?*

- మజ్లిస్‌పై రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు.
- పాత వ్యాఖ్యలపై స్పందించిన గోషా మహల్ ఎమ్మెల్యే.
- రాజకీయ వర్గాల్లో చర్చకు దారి.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మీరు పదిహేను నిమిషాలు అడిగారు కానీ నాకు ఐదు నిమిషాల సమయం ఇవ్వగలరా అని ప్రశ్నించారు. గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మండిపడ్డారు. **మిగతా 2 లో...**


# డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు.
- మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టు దిట్టమైన చర్యలు.
- రవీంద్రభారతిలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ.
- విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండ.




# సిద్దిపేటలో పులి సంచారం

- ప్రజలను అప్రమత్తం చేయాలని హరీష్ రావు సూచనలు.
- పులి దాడిలో 8 దూడల మృతి.. నష్టపరిహారం డిమాండ్.
- అర్బన్ పార్క్, ఆక్సీజన్ పార్క్ నిర్వహణపై సమీక్ష.



2 లో

# పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ కోర్టుకు హాజరు



**జనం వాయిస్, సుల్తాన్‌పూర్, ఫిబ్రవరి 20:**

లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పరువు నష్టం కేసు విచారణలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్ న్యాయస్థానానికి హాజరయ్యారు. గతంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ పరువు నష్టం దావా దాఖలైంది. తన వాంగ్మూలాన్ని నమోదు చేయించేందుకు ఆయన న్యాయస్థానానికి ప్రత్యక్షంగా హాజరైనట్లు సమాచారం. ఉదయం **మిగతా 2 లో...**

# 'అమ్మా' అనే పిలుపు కోసం

- ప్రసవ వేదనతో గర్భిణీ దారుణ నిర్ణయం.
- ఆసుపత్రికి తీసుకెళ్లే వారు లేక ఒంటరితనం.
- కడుపు కోసుకుని బిడ్డకు జన్మనిచ్చిన ఘటన.
- తల్లి పరిస్థితి విషమం.




2

# దిగ్విజయ్ సింగ్‌ను కలిసిన భట్టి విక్రమార్క

- ఢిల్లీలో కుటుంబ సమేతంగా భేటీ.
- కుమారుడు వివాహానికి ఆహ్వాన పత్రిక అందజేత.
- మార్చి ఐదున హైదరాబాద్‌లో వివాహ వేడుక.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ఢిల్లీలో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్‌ను కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. **మిగతా 2 లో...**

## నాకు ఐదు నిమిషాలు ఇవ్వగలరా?

**మొదటిపేజీ తరువాయి...** రాజాసింగ్ మాట్లాడుతూ, పదిహేను నిమిషాలు కాదు పదిహేను గంటలు, పదిహేను రోజులు, పదిహేను నెలలు అవసరమైతే పదిహేను సంవత్సరాలు ఇచ్చినా మీరు ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. మీ పూర్వీకులే హిందువులకు ఏమీ చేయలేకపోయారని, మీరు ఏమి చేస్తారని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తనకు కేవలం ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని రాజాసింగ్ సవాల్ విసిరారు. తాను ఎక్కడికి రావాలో చెప్పాలని, మీ ప్రాంతానికా, మీ ఇంటికా ఎక్కడకు రమ్మంటే అక్కడికి వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ వంటి ఆయుధాలు అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆయన వ్యాఖ్యలను ఖండిస్తుండగా, మరికొందరు మద్దతు తెలుపుతున్నారు. మొత్తం ఘటనపై రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది.

## డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యనిర్వాహక అధికారుల సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం అంకితభావంతో పని చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. మత్తు వ్యసనాల కారణంగా యువత భవిష్యత్తు దెబ్బతింటోందని, అనేక కుటుంబాలు చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల సమస్యను నిర్మూలించేందుకు కఠిన చర్యలు అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి అరాచక శక్తులను సమాజం నుంచి పూర్తిగా తొలగించాలన్న సంకల్పాన్ని వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ సౌమ్య మృతి దురదృష్టకరమని మంత్రి తెలిపారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తక్షణ స్పందనగా ఒక కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. స్మగ్లర్ల ఆగడాలను అరికట్టేందుకు అవసరమైతే ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలన్న అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలు అందజేస్తామని పేర్కొన్నారు. అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు

## సిద్దిపేటలో పులి సంచారం

**జనం వాయిస్, సిద్దిపేట, ఫిబ్రవరి 20:**

సిద్దిపేట జిల్లాలో గత నెల రోజులుగా పులి సంచారం కొనసాగుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. జిల్లా అటవీ అధికారులతో క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన ఆయన, పులి కదలికలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జనవరి 23న కామారెడ్డి ప్రాంతం నుంచి ప్రవేశించిన పులి తోగుట, జగదేవ్‌పూర్, ధన్వంతరి ప్రాంతాల్లో సంచరించి యాదాద్రి భువనగిరి, జనగామ, హుస్నాబాద్, చిన్నకోడూరు, అల్లీపూర్, విఠలపూర్ ప్రాంతాల మీదుగా ప్రస్తుతం మీడ్ మానేరు వైపు కదిలిందని అధికారులు వివరించారు. గత నెల రోజులుగా పులి సంచారం కారణంగా ఇప్పటివరకు 8 దూడలు దాడికి గురై మృతిచెందినట్లు తెలిపారు. వాటిని పెంచుకున్న రైతులకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. పూణే నుండి 15 రోజుల క్రితమే ప్రత్యేక రక్షణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, ఆ బృందం పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పులి సంచారం ఉన్న ప్రాంతాల్లో రైతులు, పంట పొలాలకు వెళ్లే వారు, బావుల వద్దకు వెళ్లే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి అప్రమత్తత చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పులి కదలికలపై గ్రామస్థులకు వెంటనే సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా సిద్దిపేటలో ఏర్పాటైన అర్బన్ పార్క్, ఆక్సిజన్ పార్క్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని, మెగా నర్సరీ నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలకు వాకింగ్, పర్యాటక అవసరాలకు ఉపయోగపడేలా పార్కులను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని హరీష్ రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి పద్మజ రాణి, ఎఫ్ ఆర్ ఓ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## దిగ్విజయ్ సింగ్‌ను కలిసిన భట్టి విక్రమార్క

**మొదటిపేజీ తరువాయి...** ఈ సందర్భంగా పరస్పర ఆత్మీయతతో మాట్లాడుకున్నారు. మార్చి ఐదవ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరుకావాల్సిందిగా భట్టి విక్రమార్క ఆహ్వానించారు. వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించినట్లు సమాచారం. దిగ్విజయ్ సింగ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వివాహ వేడుకకు హాజరయ్యే విషయంపై సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. కుటుంబ కార్యక్రమానికి ఆహ్వానించడం ఆనందంగా ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం.



# కవిత పార్టీ టీపీజేపీ ?

**మొదటిపేజీ తరువాయి...** పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్దిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదేనన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును టీపీజేపీ గా నిర్ణయించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ.ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది.ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు.నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు.ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు.

# అజారుద్దీన్ కు మంత్రి పదవీ గండం.?

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

అనూహ్యంగా మంత్రి అయిన అజారుద్దీన్‌ను పదవీ గండం వెంటాడుతోంది. గతేడాది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే మూడున్నర నెలలు గడిచిపోయింది. కానీ అజార్ ఇప్పటివరకు అటు అసెంబ్లీకి కానీ..ఇటు మండలికి కానీ ఎన్నిక కాలేదు. ఆరు నెలల్లోపు ఏదో సభకు ఎన్నిక కాకపోతే ఆయన పదవి ఊస్ట్ అవడం పక్కా.దీంతో అజారుద్దీన్ విషయంపై కాంగ్రెస్ పెద్దలు పెద్ద కసరత్తే చేస్తున్నారట. అజారుద్దీన్‌ను పదవీ గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ వేస్తున్నారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యూహాలకు పదును పెడుతున్నారట. ఈ దెబ్బతో ఇటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ, త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి మార్గం సుగమమం కానున్నట్లు తెలుస్తోంది.అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గత ఏడాది ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయలేదు. అయితే ఇంతలోపే అజారుద్దీన్ మంత్రిగా పదవి చేపట్టి ఆరు నెలలు పూర్తి అయ్యే పరిస్థితి వస్తుంది. దీంతో కొత్త ఫార్ములాకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్.వచ్చే ఏప్రిల్ 30 నాటికి అజారుద్దీన్ ఎమ్మెల్సీగానో లేదా ఎమ్మెల్యేగానో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుంటే మంత్రి పదవికి గండం తప్పదు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా శాసనసభకు ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఇక ఎమ్మెల్సీగానే ఎన్నిక కావాల్సి ఉంది. అయితే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉంది. ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా నియమించాలని క్యాబినెట్ నిర్ణయించినా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో సస్పెన్స్ కొనసాగుతోంది. అజారుద్దీన్ను పదవీగండం నుంచి గట్టెక్కించేందుకు..రేవంత్ వ్యూహాన్ని రచిస్తున్నారట. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నవారిలో ఒకరి చేత రాజీనామా చేయించి వారి స్థానంలో అజారుద్దీన్ను మండలికి పంపించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీగా రాజీనామా చేయబోయే నేతకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసే అవకాశం ఉందట. అయితే అజారుద్దీన్ కోసం ఎమ్మెల్సీ సీటుకు రాజీనామా చేసే నేత ఎవరో.? రాజ్యసభకు వెళ్లేదెవరో.? వేచి చూడాలి.

# దేశానికి ప్రత్యేక కృత్రిమ మేధ మండలి అవసరం

**మొదటిపేజీ తరువాయి...** కృత్రిమ మేధ విలువ శృంఖల అంతటా భారత్ నాయకత్వం సాధించాలని ఆయన పేర్కొన్నారు. చిప్ తయారీ, హరిత శక్తి, దత్తాంశ నిల్వ, వేదికలు, మౌలిక భాషలు, అనువర్తనాలు, సేవలు వంటి అన్ని స్థాయిల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేసే జాతీయ కృత్రిమ మేధ కార్యాచరణ గదిని ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఆ కార్యాచరణ గదికి హైదరాబాద్‌ను ఆతిథ్య నగరంగా ప్రతిపాదించారు. అలాగే ప్రపంచ స్థాయి పరిశోధనలకు అంకితమైన కృత్రిమ మేధ విశ్వవిద్యాలయాన్ని దేశవ్యాప్తంగా శాఖలతో ఏర్పాటు చేయాలని కోరారు. అధునాతన గణన చిప్‌ల దేశీయ తయారీ అత్యవసరమని, అరుదైన ఖనిజ వనరులతో కూడిన సరఫరా శృంఖలలో భారత్ భాగస్వామ్యం బలోపేతం కావాలని తెలిపారు. కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాలు కోల్పోకుండా, మరిన్ని అవకాశాలు సృష్టించే విధంగా పునర్‌నైపుణ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అగ్ని, చక్రం, వ్యవసాయం నుంచి ప్రజాస్వామ్యం, విద్యుత్, విమానయానం, వ్యాధి నిరోధక టీకాలు, అంతర్జాలం వరకు మానవ నాగరికతను మార్చిన ఆవిష్కరణలను ప్రస్తావిస్తూ, కృత్రిమ మేధ కూడా అలాంటి మార్పునే తీసుకువస్తుందని అన్నారు. పరిశ్రమ విప్లవాలను భారత్ కోల్పోయిన అనుభవాన్ని గుర్తుచేసి, కృత్రిమ మేధ విప్లవాన్ని మాత్రం దేశం కోల్పోవద్దని పిలుపునిచ్చారు. దృఢ విధానాలు, బలమైన సంస్థలు, వ్యూహాత్మక పెట్టుబడులతో భారత్ కేవలం పాల్గొనే దేశంగా కాకుండా ప్రపంచ నాయకుడిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

# ‘అమ్మా’ అనే పిలుపు కోసం

**జనం వాయిస్, డెస్క్, ఫిబ్రవరి 20:**

‘అమ్మా’ అనే పిలుపు కోసం ఓ మహిళ పడే తపన ఎంత గొప్పదో మరోసారి గుర్తు చేసిన దారుణ ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. ఆసుపత్రికి తీసుకెళ్లే వారు లేక, ప్రసవ వేదనను తట్టుకోలేక ఓ గర్భిణీ తన పొత్తికడుపును కత్తితో కోసుకున్న సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. తీవ్రమైన నొప్పి, ఒంటరితనం కలిసి ఆమెను ఆవేదనతో కూడిన నిర్ణయానికి నెట్టాయని స్థానికులు చెబుతున్నారు. నంద్వాల్ గ్రామానికి చెందిన నంకై అనే మహిళ గత ఆరు నెలలుగా కష్టాల్లోనే జీవనం సాగిస్తోంది. అనారోగ్యంతో భర్త మృతి చెందడంతో ఆమె ఒంటరిగానే గర్భధారణ కాలాన్ని పూర్తి చేసింది. నెలలు నిండిన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. సహాయం కోసం ఆమె పలుమార్లు కేకలు వేసినా ఎవరూ స్పందించలేదని గ్రామస్థులు తెలిపారు. నొప్పులు మరింత తీవ్రమవుతుండడంతో ఆ బాధను భరించలేక ఆమె వంటింట్లో ఉన్న కూరగాయల కత్తితో తన పొత్తికడుపును కోసుకుందని సమాచారం. ఆమె ఆర్తనాదాలు విన్న గ్రామస్థులు పరుగెత్తుకుని వెళ్లి చూసేసరికి రక్తపు మడుగులో పడిఉన్న నంకైను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. కడుపు కోసుకోవడంతో అంతర్గత అవయవాలు బయటకు వచ్చిన పరిస్థితిలో వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ వైద్యుల పర్యవేక్షణలో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ, తీవ్ర రక్తస్రావం కారణంగా తల్లి పరిస్థితి విషమంగా మారింది. జిల్లా ఆసుపత్రికి తరలించిన తర్వాత గాయాల తీవ్రతను చూసి వైద్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గాయం లోతుగా ఉండటంతో పాటు అధిక రక్తస్రావం జరిగిందని వైద్య వర్గాలు తెలిపాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను లక్నో నగరంలోని ఉన్నత వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆమె ప్రాణాలతో పోరాడుతున్నట్లు సమాచారం. ఈ ఘటన గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల లోపంపై మరొకసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**మొదటిపేజీ తరువాయి...** ఢిల్లీ నుంచి బయలుదేరిన రాహుల్ గాంధీ నేరుగా సుల్తాన్‌పూర్ చేరుకుని విచారణకు హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అజయ్ రాయ్ మాట్లాడుతూ, కోర్టు విచారణ కోసం రాహుల్ గాంధీ సుల్తాన్‌పూర్ వచ్చినట్లు వెల్లడించారు. న్యాయస్థాన కార్యక్రమం ముగిసిన వెంటనే ఆయన తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ రాకను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు సుల్తాన్‌పూర్ పట్టణంలో “సత్యమేవ జయతే” అని పేర్కొన్న పోస్టర్లను ఏర్పాటు చేశారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సమయంలో అమిత్ షాపై రాహుల్ గాంధీ అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ నాయకుడు విజయ్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు విచారణలో భాగంగా గతంలో కూడా రాహుల్ గాంధీ న్యాయస్థానానికి హాజరై తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తనపై రాజకీయ కుట్రలో భాగంగానే ఈ దావా దాఖలైందని ఆయన ఆరోపించారు. ఈ కేసులో ఆధారాలను సమర్పించాలని ఫిర్యాదుదారు విజయ్ మిశ్రాను న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం. కేసు తదుపరి విచారణకు తేదీ నిర్ణయించనున్నారు. రాజకీయ వర్గాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణ వార్తలు

# శభాష్ హైడ్రా డీఆర్ ఎఫ్

## 'గాడెస్ ఆఫ్ ఫోక్ సమ్మక్క సారలమ్మ జాతర' గ్రంథావిష్కరణ



- ప్రజా భవన్‌లో ఘనంగా ఆవిష్కరించిన మంత్రి సీతక్క.
- అరుదైన చిత్రాలతో సుసంపన్నమైన కాఫీ టేబుల్ పుస్తకం.
- కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌కు అభినందనలు.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

ప్రజా భవన్‌లో 'గాడెస్ ఆఫ్ ఫోక్ సమ్మక్క సారలమ్మ జాతర' కాఫీ టేబుల్ పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ పుస్తకాన్ని రూపొందించిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌కు అభినందనలు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరలోని అరుదైన చిత్రాలతో రూపొందించిన ఈ పుస్తకం జాతర వైభవాన్ని ప్రతిబింబిస్తుందని మంత్రి పేర్కొన్నారు. జాతర ఆధ్యాత్మికత, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతీ పుటలో ఆవిష్కరించారని తెలిపారు. ఈ విశిష్ట గ్రంథానికి చిత్రాలను అందించిన ఫోటోగ్రాఫర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి కృషి వల్ల జాతరలోని అద్భుత క్షణాలు శాశ్వతంగా నిలిచిపోయాయని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర తెలంగాణ గర్వకారణమని, గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇటువంటి ప్రచురణలు భవిష్యత్ తరాలకు సంస్కృతి, చరిత్రను పరిచయం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

- మూడు నిమిషాల్లో మంటలు అదుపు.
- సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి.
- కమిషనర్ చేతుల మీదుగా సన్మానం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**



అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో జరిగిన అగ్నిప్రమాద సమయంలో కేవలం మూడు నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చిన హైడ్రా విపత్తు స్పందన బృందాన్ని కమిషనర్ ఏ వీ రంగనాథ్ సన్మానించారు. వేగవంతమైన చర్యలతో పెను ప్రమాదాన్ని నివారించిన సిబ్బందిని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. హైడ్రా డీఆర్ ఎఫ్ టీమ్ పదిహేడు, పందొమ్మిది, నలభై బృందాలకు చెందిన మొత్తం పదిహేను మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. మంటలను ఆర్పడమే కాకుండా, భవనంలో చిక్కుకున్న వారిని అగ్నిమాపక మరియు పోలీసు సిబ్బందితో సమన్వయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన తీరును కమిషనర్ కొనియాడారు. సంఘటన వివరాలను ఈ సందర్భంగా సిబ్బంది వివరించారు. సమాచారం అందగానే సమీపంలో ఉన్న పదిహేడు బృందం మూడు నిమిషాల్లో అక్కడికి చేరుకుందని, అనంతరం మరికొన్ని నిమిషాల్లో పందొమ్మిది, నలభై బృందాలు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు. వేగం, సమన్వయం, కర్తవ్యనిర్వహణ వల్లే ప్రమాదం తీవ్రత తగ్గిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, సంబంధిత అధికారులు, బృంద సభ్యులు పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కమిషనర్ అన్నారు.

## భూపాలపల్లి జిల్లా కోర్టులో ఏసీబీ దాడులు

- ఐదు వేల రూపాయలు లంచం తీసుకుంటూ ముగ్గురు సిబ్బంది పట్టుబాటు.
- సర్టిఫైడ్ కాపీ కోసం డిమాండ్.. న్యాయవాది ఫిర్యాదుతో వల.
- స్టెనోగ్రాఫర్ సహా ముగ్గురిపై కేసు నమోదు.

**జనం వాయిస్, భూపాలపల్లి, ఫిబ్రవరి 20:**

భూపాలపల్లి జిల్లా కోర్టులో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు కోర్టు సిబ్బందిని పట్టుకున్నారు. సర్టిఫైడ్ కాపీ ఇవ్వడానికి ఐదు వేల రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలపై ఈ చర్యలు చేపట్టారు. స్టెనోగ్రాఫర్ పాలకుర్తి సాయి చరణ్, సిబ్బంది పున్నం రజిత, కొమ్ము సునీతలను లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. సీహెచ్ గోపాలరావు అనే న్యాయవాది సర్టిఫైడ్ కాపీ కోసం వెళ్లగా డబ్బులు డిమాండ్ చేశారని, దీనిపై ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఫిర్యాదు మేరకు పక్కదిబందీ ప్రణాళికతో ఏసీబీ అధికారులు వల పన్ని దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న సమయంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.




న్యాయస్థానాల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో అవినీతి చోటుచేసుకోవడం తీవ్రంగా పరిగణిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దక్షిణాసియాలో వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్

- తెలంగాణ మెడికల్ టూరిజం సొసైటీ ఏర్పాటు ప్రతిపాదన.
- పీపీపీ విధానంలో సమగ్ర వైద్య పర్యాటక కేంద్రానికి ప్రణాళిక.
- యాభైకు పైగా గుర్తింపు పొందిన ఆసుపత్రులతో ముందంజ.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**



దక్షిణాసియాలో అత్యంత సమగ్ర వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ముందడుగు వేసింది. సంస్థ నిర్వాహక అధికారి వి. క్రాంతి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి భాగస్వామ్య వర్గాల సమావేశం నిర్వహించి తెలంగాణ మెడికల్ టూరిజం సొసైటీ ఏర్పాటు ప్రతిపాదనపై చర్చించారు. కేంద్ర బడ్జెట్ 2026 కింద పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో సమగ్ర మెడికల్ వ్యాల్యూ టూరిజం హబ్‌ను స్థాపించాలనే ప్రణాళికను ఈ సమావేశంలో ప్రతిపాదించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే యాభైకు పైగా గుర్తింపు పొందిన ఆసుపత్రులు, పన్నెండు వేలకుపైగా పడకల సామర్థ్యం ఉన్న నేపథ్యంలో వైద్య పర్యాటక రంగంలో నగరం వేగంగా ఎదుగుతోందని అధికారులు తెలిపారు. విదేశీ రోగుల ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచస్థాయి వైద్య సేవలు, సౌకర్యాలు, నివాస వసతులు, ప్రయాణ సదుపాయాలను సమగ్రంగా అనుసంధానించే మౌలిక వసతుల అభివృద్ధి అవసరమని పేర్కొన్నారు. సమగ్ర వైద్య పర్యాటక హబ్ ఏర్పాటుతో రాష్ట్రానికి ఆర్థిక లాభాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వైద్య ప్రయాణ రంగంలో హైదరాబాద్ ప్రముఖ స్థానం సంపాదించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. తెలంగాణను వైద్య సేవల గ్లోబల్ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు.

## బోడుప్పల్‌లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు.
- భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమం.
- రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

బోడుప్పల్‌లోని కేశవ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన వేద మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం సందర్భంగా మంత్రి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత సమాజంలో శాంతి, ఐక్యతలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. వేడుకలు భక్తి శ్రద్ధలతో ముగిశాయి.



## సిద్దిపేట యువత కోసం 'హరీష్ అన్న ఉద్యోగ యాప్' ప్రారంభం



**జనం వాయిస్, సిద్దిపేట, ఫిబ్రవరి 20:**

- ఉచిత ఆన్‌లైన్ తరగతులతో ఉద్యోగ అవకాశాల దిశగా అడుగు.
- పట్టుదల, అంకితభావమే విజయానికి మంత్రం హరీష్ రావు.
- సిద్దిపేటను విద్య, ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దినట్లు వెల్లడి.

సిద్దిపేట యువతీయువకుల కోసం ఉచిత ఆన్‌లైన్ తరగతులు అందించే 'హరీష్ అన్న ఉద్యోగ యాప్'ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడిన ఆయన, ఈ యాప్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మరింత సులభమవుతాయని తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ చాలా యాప్‌లు మొదట ఉచితం అంటూ తరువాత రుసుములు వసూలు చేస్తాయని, అయితే ఈ యాప్‌ను సీరియస్‌గా వినియోగించుకుని ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటామని చెప్పడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ఏ పని చేసినా మంచి ఫలితాలు వచ్చినప్పుడే సంతృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలకు చరిత్ర ఉందని, ఇక్కడే కేసీఆర్ చదువుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిని అందించిన కళాశాల ఇదేనని అన్నారు. నాక్‌లో ఏ గ్రేడ్ సాధించేందుకు సిబ్బంది, ప్రిన్సిపాల్ కృషి అభినందనీయమన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు 95 శాతం ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నారని, వ్యాపారాల వైపు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. సిద్దిపేటను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, ఒక ప్రభుత్వ ఐటీఐ, వైద్య కళాశాలలను తీసుకువచ్చినట్లు తెలిపారు. రెండు వైద్య కళాశాలలు, రెండు నర్సింగ్ కళాశాలలు, రెండు పారా మెడికల్ కళాశాలలు, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఐటీ టవర్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా సాంకేతికతను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఒక సంవత్సరం కష్టపడి చదివితే జీవితం మారిపోతుందని, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగాలని ప్రేరేపించారు. ఈ యాప్ యువత జీవితాలను మారుస్తుందని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బ్యాడ్మింటన్‌లో వరంగల్ ఏసీపీల జోడీకి స్వర్ణం

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**

సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా జరుగుతున్న నాలుగో తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్ అధికారులు ప్రతిభ చాటారు. 55 ఏళ్ల గెజిటెడ్ అధికారుల బ్యాడ్మింటన్ విభాగంలో వరంగల్‌కు చెందిన ఏసీపీలు జితేందర్ రెడ్డి, మధుసూదన్ జోడీ అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కోర్టులో చురుకైన ఆటతీరుతో ప్రత్యర్థులను ఓడించి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. సమన్వయం, అనుభవం, క్రీడాస్ఫూర్తి కలగలిపిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రతి మ్యాచ్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫైనల్ వరకు విజయ పరంపర కొనసాగించారు. ఈ విజయంతో వరంగల్ కమిషనరేట్‌కు గౌరవం తెచ్చిన ఏసీపీలను సహచర అధికారులు అభినందించారు. పోలీస్ సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ క్రీడలు వేదికగా నిలుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా సమ్మేళనం మరికొన్ని రోజులు కొనసాగనుండగా, ఇతర విభాగాల్లోనూ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి.



# మండలిలో ఆందోళనపై రాజకీయ రగడ

- "ఆధారం చూపితే రాజీనామా" వైసీపీ ఎమ్మెల్సీ సవాల్.
- వీడియో విడుదల చేసిన మంత్రి సంధ్యారాణి.
- పరస్పర ఆరోపణలతో ఉద్రిక్త వాతావరణం.



**జనం వాయిస్, అమరావతి, ఫిబ్రవరి 20:**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి చిత్రాలను పట్టుకుని ఆందోళన చేపట్టిన ఘటనపై రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలతో సభలోకి వెళ్లినట్లు నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. ఈ సవాల్‌కు స్పందించిన మంత్రి సంధ్యారాణి, వైసీపీ సభ్యులు చెప్పులతో ఉన్నట్లు కనిపిస్తున్న వీడియోను విడుదల చేశారు. స్వామివారి చిత్రాలను ప్లకార్డుల మాదిరిగా వినియోగించడం సరికాదని, ఇది దుర్మార్గ చర్యగా పేర్కొన్నారు. ఒకరు చిత్రాన్ని తలకిందులుగా పట్టుకున్నారని, నిరసన అనంతరం టేబుల్‌పై పడేశారని ఆరోపించారు. వైసీపీ సభ్యులకు దేవుడిపై భయం, భక్తి లేవని మంత్రి విమర్శించారు. స్వామివారి పట్ల అవమానకర ప్రవర్తన చేశారని ఆరోపిస్తూ మాధవరావు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాలతో మండలిలో జరిగిన ఘటనపై రాజకీయ చర్చ మరింత ముదిరింది. ఇక వైసీపీ వర్గాలు తమపై చేసిన ఆరోపణలు అసత్యమని పునరుద్ఘాటిస్తున్నాయి. పరస్పర ఆరోపణలు, సవాళ్ల మధ్య ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఆంధ్రప్రదేశ్

## విసన్నపేటలో కారు బీభత్సం

- మద్యం మత్తులో యువకుల అతివేగం.
- రోడ్డుపక్కన నిలిపిన వాహనాలపై దూసుకెళ్లిన కారు.
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.

**జనం వాయిస్, విసన్నపేట, ఫిబ్రవరి 20:**

ఎన్టీఆర్ జిల్లా విసన్నపేటలో మద్యం మత్తులో కారు నడిపిన యువకులు బీభత్సం సృష్టించారు. శ్రీరామ్ థియేటర్ సమీపం నుంచి బస్టాండ్ వరకు రోడ్డుపక్కన నిలిపిన పలు వాహనాలను ఢీకొట్టుతూ దూసుకెళ్లారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కారు అదుపు తప్పి వరుసగా వాహనాలను ఢీకొట్టడంతో నష్టాలు సంభవించాయి. పరిస్థితిని గమనించిన స్థానిక ప్రజలు కారును వెంబడించారు. అయితే యువకులు అతివేగంతో నూజివీడు రోడ్డువైపు పారిపోయే ప్రయత్నం చేశారు. చివరకు నూజివీడు రోడ్డులో విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో కారు నిలిచిపోయింది. ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం సంభవించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో వాహనం నడిపినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు హెచ్చరించారు.



# లంచం డిమాండ్ వ్యవహారం.కానిస్టేబుల్ సస్పెన్షన్

**జనం వాయిస్, విజయవాడ, ఫిబ్రవరి 20:**

ఓ కేసులో నిందితులుగా పేర్లు చేర్చకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి పోలీసు స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండలరావును సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత ఎస్ఐ ఉమామహేశ్వరరావుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. గోపినేనిపాలెంలో నమోదైన ఒక కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు స్టేషన్ బెయిల్‌పై పంపించారు. అయితే అదే కేసులో నిందితుడి సోదరుడు, అతని స్నేహితులను తరచుగా స్టేషన్‌కు పిలిపిస్తూ వేధిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. కేసులో పేర్లు చేర్చకుండా ఉండేందుకు 50 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితులు అవినీతి నిరోధక శాఖకు సమాచారం అందించారు. లంచం స్వీకరిస్తుండగా పట్టుకునేందుకు అధికారులు పథకం రచించారు. నిందితుడి తండ్రి డబ్బులు ఇవ్వడానికి వెళ్లగా, ఆ సమయంలో స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బయట ఉన్న అవినీతి నిరోధక శాఖ సిబ్బందిని గుర్తించి అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. వెంటనే ఎస్ఐకి సమాచారం ఇవ్వడంతో ఆయన స్టేషన్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సీపీ రాజశేఖరబాబు విచారణకు ఆదేశించారు. గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో విచారణ జరిపి ప్రాథమికంగా కానిస్టేబుల్ పాత్ర నిర్ధారించారు. డీసీపీ సిఫార్సు మేరకు కానిస్టేబుల్ కొండలరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. స్టేషన్ సీసీ దృశ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో చిత్తూరు జిల్లాలో పనిచేసిన ఎస్ఐ సీవీ





నరసింహులు అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన ఘటనను అధికారులు గుర్తు చేశారు. అధికార దుర్వినియోగం, లంచం ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# గుంటూరులో ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర

- మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళి.
- తెనాలిలో రచ్చబండకు ప్రజల అశేష స్పందన.
- గ్రామీణాభివృద్ధిలో ఉపాధి హామీ చట్టం పాత్ర వివరణ.

**జనం వాయిస్, గుంటూరు, ఫిబ్రవరి 20:**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర నేడు గుంటూరు జిల్లాలో కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ షర్మిల ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం తెనాలి పట్టణంలో రచ్చబండ నిర్వహించగా నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం పాత్రను వివరించారు. ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజుల పని హక్కుగా మారిందని, గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గాయని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ చట్టం దోహదపడిందని వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన కొత్త పథకం వల్ల గ్రామీణ కార్మికులకు నష్టం కలిగే అవకాశం ఉందని యాత్రలో అవగాహన కల్పించారు. ఉపాధి హామీ చట్టాన్ని గాంధీజీ పేరుతోనే కొనసాగించాలని శ్రామికులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజల జీవనోపాధిని కాపాడేందుకు ఈ యాత్ర కొనసాగుతుందని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ తీరు దేశానికి అవమానం

## దగ్గుబాటి పురందేశ్వరి విమర్శలు

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:**

భారతీయ జనతా పార్టీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కాంగ్రెస్ పార్టీ వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రపంచ కృత్రిమ మేధ సదస్సును నిర్వహిస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ గందరగోళం సృష్టించిందని ఆమె ఆరోపించారు. దేశ గౌరవాన్ని పక్కనపెట్టి అంతర్జాతీయ వేదికపై భారత్‌ను అగౌరవపరిచేలా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సదస్సు వేదిక వద్ద చొక్కాలు విప్పి నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే కీలక సమయంలో ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టారని ఆమె వ్యాఖ్యానించారు. భారత్ సాంకేతిక రంగంలో ముందంజలో నిలవడానికి కృషి చేస్తున్న తరుణంలో ఇలాంటి ప్రవర్తన అనవసరమని పురందేశ్వరి అన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు



ఉండొచ్చు గానీ దేశ ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యవహరించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయిలో భారత్ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను ప్రజలు సమర్థించరని ఆమె అభిప్రాయపడ్డారు. రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పరిమితులలోనే జరగాలని, అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని అపకీర్తి పరచే విధంగా వ్యవహరించడం తగదని ఆమె స్పష్టం చేశారు.

# కృత్రిమ మేధ, క్వాంటం రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు భారీ ముందడుగు

- అమరావతిలో క్వాంటం వ్యాలీ లక్ష్యంగా ఏడు అవగాహన ఒప్పందాలు.
- యువతకు నైపుణ్యాభివృద్ధి, పాలనలో సాంకేతిక వినియోగం విస్తరణ.
- జాతీయ, అంతర్జాతీయ గుర్తింపుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:**

ఆంధ్రప్రదేశ్‌ను కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతిక రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. భవిష్యత్ సాంకేతికతను అందిపుచ్చుకుని యువతకు విస్తృత అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తోంది. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా నిర్వహించిన భారత కృత్రిమ మేధ ప్రభావ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని పలువురు ప్రముఖ సంస్థలతో ఏడు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే ఈ ఒప్పందాల ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ గణన కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం అమరావతి క్వాంటం వ్యాలీలో కృత్రిమ మేధ, క్వాంటం నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనిని డిజిటల్ దౌత్య కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక సంస్థ ఐబీఎంతో కుదిరిన ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని యువతకు క్వాంటం, కృత్రిమ మేధ, సైబర్ భద్రత రంగాల్లో విస్తృత శిక్షణ ఇవ్వనున్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కృత్రిమ మేధ, క్వాంటం విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలో స్థాపించేందుకు జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక సంస్థతో మరో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ విశ్వవిద్యాలయానికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చగా, రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించనుంది. అమరావతిని క్వాంటం గణనలో జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యంగా పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో స్వదేశీ కృత్రిమ మేధ నిర్మాణాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ శాఖలకు సేవలు అందించడంతో పాటు, భారతీయ భాషల అనుసంధానాన్ని బలోపేతం చేయనున్నారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికత బలోపేతానికి ప్రత్యేక అకాడమీలు, ప్రయోగశాలలు ఏర్పాటు చేయనున్నారు. మరో సంస్థతో కుదిరిన ఒప్పందం ద్వారా అమరావతి క్వాంటం వ్యాలీలో మరొక నైపుణ్య కేంద్రం స్థాపించబడనుంది. భారీ స్థాయిలో యువతకు శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళిక




రూపొందించారు. అలాగే భారతీయ సాంకేతిక విద్యాసంస్థ మద్రాసుతో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం కృత్రిమ మేధ ఆధారిత బోధనా సహాయక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ చర్యలతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ సాంకేతిక రంగంలో చిరునామాగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో

# కాంగ్రెస్, బిఆర్ఎస్ అనైతిక పొత్తు





**జనం వాయిస్, జమ్మికుంట:**

బిజెపి కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం పురస్కరించుకుని పట్టణంలో పెద్దసంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, స్వామి వివేకానంద, గాంధీ విగ్రహాలకు కౌన్సిలర్లు పూలమాల వేసి, స్మరించుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్ అధ్యక్షతన మున్సిపల్ కమీషనర్ ఆయాజ్ మూడోవ వార్డు కౌన్సిలర్ కొలకాని రాజకుమారి-రాజు, 10వ వార్డు కౌన్సిలర్ తూర్పటి చందన-శంకర్, 20వ వార్డు కౌన్సిలర్ గుర్రం కావ్య-పరుశరాములు తో ప్రమాణస్వీకారం చేయించారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లను చైర్మన్, వైస్ చైర్మన్లు శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు మాట్లాడుతూ.. జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు స్పష్టమైన మెజారిటీ లేకపోయినా ఆరెండు పార్టీలు అనైతిక పొత్తు కొనసాగించాలని లోపాయికారీ ఒప్పందం చేసుకుని చైర్మన్ ఎన్నికల్లో పాల్గొన్నాయని జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు విమర్శించారు, కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ పార్టీలు చైర్మన్ ఎన్నిక కోసం బిజెపి మద్దతు కావాలని అడిగాయని, మద్దతు ఇస్తే బిజెపికి వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు కోట్ల రూపాయల ఆశ చూపిన బిజెపి కౌన్సిలర్లు పార్టీ నిర్ణయం మేరకు అవినీతి పార్టీలకు మద్దతు ఇవ్వకుండా చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనలేదని తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం.
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు కలెక్టర్ ప్రాధాన్యం.
- సాంప్రదాయ నృత్యాలతో అలరించిన చిన్నారులు.

**జనం వాయిస్,జగిత్యాల, ఫిబ్రవరి 20:**

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ హాజరయ్యారు. జయంతి ఉత్సవాలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల ఆధ్యాత్మిక ఆరాధ్య గురువైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చెడు అలవాట్లను విడిచిపెట్టి మంచి అలవాట్లను అలవరచుకోవాలని బోధించారని తెలిపారు. ఉన్నతమైన జీవన విధానాన్ని పెంపొందించుకోవాలంటే మంచి సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. 287 సంవత్సరాల తర్వాత కూడా జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామంటే వారి బోధనలు గిరిజన సమాజానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. ఈ



సందర్భంగా కలెక్టర్ గిరిజన సంప్రదాయ వేషధారణలో పాల్గొని చిన్నారుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలను ఆస్వాదించారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. కళాకారుల పాటలు, నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. రాజ్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, గిరిజన సంఘ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. గిరిజన సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



# కరీంనగర్‌లో రఘునందన్ రావు దిష్టిబొమ్మ దగ్ధం.

## - బీసీ ద్రోహి అంటు నిరసన వ్యక్తం చేసిన ముదిరాజ్ సంఘాలు.

**జనం వాయిస్, కరీంనగర్:**



బీజేపీ ఎంపీ రఘు నందన్ రావు బిసి ద్రోహి అంటూ పెద్దమ్మ తల్లి అర్బన్ ముదిరాజ్ కుల సంక్షేమ సంఘం మరియు తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి కరీంనగర్ ఆధ్వర్యంలో గీత భవన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు బీసీ ద్రోహిగా అభివర్ణిస్తూ ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో బీసీ బిడ్డ నీలం కవిత-మధు ముదిరాజ్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన సందర్భంలో పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి ఒకే వాహనంలో వెళ్లి ఎక్స్-అఫీషియో ఓటు వినియోగించుకోవడం బీసీ సమాజానికి అన్యాయం చేయడమేనని నేతలు ఆరోపించారు. బీసీ ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. అనంతరం బీసీ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని సంఘ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేపీసీ అధ్యక్షులు చిక్కుడు రాజయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నిమ్మల కిషన్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి ఎరవేణి రామాంజనేయులు, టీ.ఎం.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు కూనచ్చుల మహేందర్ ముదిరాజ్, బాలంకి మల్లేష్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మౌటం సంపత్ ముదిరాజ్, పిల్లి రవి ముదిరాజ్, ఉపాధ్యక్షులు గుడ్డెలుగులా పోచయ్య ముదిరాజ్, ఎన్.ఎం.ఆర్ శేఖర్ ముదిరాజ్, ఎరవేణి లక్ష్మణ్, తిప్పరవేణి స్వామి, మాచర్ల రమేష్, గరిగే రాజయ్య, కొత్తూరు రాజయ్య, జెట్టి సంపత్, జడగల శ్రీనివాస్, జెట్టి బాలయ్య ముదిరాజ్, జెట్టి ప్రభాకర్ ముదిరాజ్, రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడల్లో మెరిసిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

- సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు.
- వివిధ విభాగాల్లో బహుమతులు సాధించిన జిల్లా విద్యార్థులు.
- సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సత్కార కార్యక్రమం.



**జనం వాయిస్,పెద్దపల్లి, ఫిబ్రవరి 20:**

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విద్యార్థులను పిలిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరి 17న హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ శారీరక విద్య కళాశాలలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పెద్దపల్లి జిల్లాకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలవడం జిల్లా గర్వకారణమన్నారు. జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్ జాగ్ వాకింగ్‌లో ప్రథమ బహుమతి సాధించారు. కమాన్‌పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎడునూరి పౌర్ణమి చెస్ పోటీలో ప్రథమ బహుమతి అందుకున్నారు. రొంపికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో ప్రథమ బహుమతి, మ్యూజికల్ చైర్‌లో ద్వితీయ బహుమతి, జిగ్ జాగ్ వాకింగ్‌లో ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాశాఖ అధికారి శారద ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఈ సమన్వయకర్త కవితతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# మహిళా న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయండి.

## - వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్, పులి సత్యనారాయణ.

**జనం వాయిస్, వరంగల్:**



అవనిలో సగమైన మహిళలు సమాజంలో ఎన్నో సమస్యలు ఎదుర్కుంటున్న న్యాయ వ్యవస్థలో కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అట్టి సమస్యలపై ఈ నెల 28న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో జరుగు మహిళా న్యాయవాదుల తెలంగాణ రాష్ట్ర సదస్సుకు మహిళా న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్, పులి సత్యనారాయణ లు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులతో కలసి శుక్రవారం సదస్సు గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలు న్యాయ వ్యవస్థలో రాణిస్తునపటికీ వివక్షను ఎదుర్కొంటున్నారని, ఐక్యతతో ఆ వివక్షను ఎదుర్కొని సమాన అవకాశాలను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ మహిళా న్యాయవాదుల సదస్సుకు ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, విశిష్ట అతిథులుగా జస్టిస్ తిరుమలదేవి ఈడ, ప్రత్యేక ఆహ్వానితులుగా ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే హాజరవుతారని, భారతీయ న్యాయ వ్యవస్థ దాని పితృస్వామ్య స్వభావం మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రాసిక్యూటర్లు వారి వృత్తిపరమైన అభివృద్ధి పరిష్కారాలలో ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై హై కోర్టు రిటైర్డ్ జడ్జి జి రాధారాణి సందేశం ఇస్తారని తెలిపారు. న్యాయ రక్షకులను రక్షించండి, మహిళా న్యాయవాదులపై ప్రత్యేక దృష్టి సారించి న్యాయవాదుల రక్షణ చట్టం యొక్క రాజ్యాంగ అవసరం అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ న్యాయవాది ఆర్ గంగాభవాని, ఉన్నత న్యాయస్థానాలలో మహిళా న్యాయమూర్తులు మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు పదవీకాల స్థానాలతో సహా జనాభా దామాషా రిజర్వేషన్లను అమలు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం, బార్ కౌన్సిల్‌లు బార్ అసోసియేషన్ల ఎన్నికలలో మహిళా వాటాలో బహుజన కోటా తగిన ప్రాతినిధ్యం అనే అంశంపై ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ రిటైర్డ్ అధికారి పి సత్యనారాయణ మూర్తి సందేశం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రేవూరి శశిరేఖ, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్రప్రసాద్, వరంగల్ జిల్లా కన్వీనర్ విలాసాగరం సురేందర్ గౌడ్, హనుమకొండ బార్ కన్వీనర్ పూసపల్లి శ్రీనివాస్, న్యాయవాదులు చింత సాంబశివరావు, సి మల్లేష్, సుందర్ రామ్, రమాదేవి, ఉమా గౌడ్, శ్రీలత, అన్నపూర్ణ, అనిత, రాధిక, సుప్రజ, సుల్తానా, పద్మ యాదవ్, సంధ్య, జయశ్రీ, రజిత, బిందు ప్రియ, మౌనిక, జలజ, జి ఆర్ శ్రీనివాస్, దండు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 24న జాబ్ మేళా నిర్వహణ.

## - జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్.

**జనం వాయిస్,పెద్దపల్లి , ఫిబ్రవరి -20**

జిల్లాలోని నిరుద్యోగ యువతీ ,యువకులకు సాక్సెస్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఫిబ్రవరి 24 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్సెస్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి కంపెనీలో మొత్తం 51 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 50, మార్కెటింగ్ మేనేజర్ 1 పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ ,ఎంబిఏ, మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్ డిగ్రీ విద్య అర్హతలు కలిగిన వారు అర్హులని, వయస్సు 18 నుంచి 36 మధ్యలో ఉండాలని అన్నారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 24న ఉదయం 11 గంటల కు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దినపత్రిక జనం వాయిస్ RNI NO:TGTEL/26/A0383 తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

శనివారం, ఫిబ్రవరి 21, 2026

# వైభవ్ సూర్యవంశీ భారీ షాట్‌కు పగిలిన నీటి పైప్



యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తన శక్తివంతమైన ప్రహారాలతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇంకా సీనియర్ పురుషుల క్రికెట్‌లో పూర్తి స్థాయిలో అడుగుపెట్టకముందే అతడు చూపిస్తున్న దూకుడు విశేషంగా నిలుస్తోంది. ఇటీవల ముగిసిన పందొమ్మిదేళ్ల లోపు ప్రపంచ కప్ పోటీలలో అతడు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఫైనల్‌లో ఇంగ్లాండ్ జట్టుపై 175 పరుగులు సాధించి జట్టు విజయానికి కీలకంగా మారిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాబోయే భారత ప్రీమియర్ లీగ్ సీజన్‌కు సిద్ధమవుతూ నాగపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో సాధనలో పాల్గొంటున్నాడు. గురువారం జరిగిన సాధన సమయంలో అతడు స్క్వేర్ లెగ్ దిశగా బలమైన పుల్ ప్రహారం ఆడగా బంతి దూసుకెళ్లి సమీప భవనం పైభాగంలో ఉన్న నీటి పైప్‌ను బలంగా తాకింది. ఆ ఝులక్‌కు పైప్ చిల్లు పడి నీరు బయటకు కారడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను రాజస్థాన్ రాయల్స్ జట్టు తమ సామాజిక మాధ్యమ వేదికలో పంచుకుంటూ యువ ఆటగాడి శక్తివంతమైన ఆటతీరును ప్రశంసించింది. వైభవ్ సూర్యవంశీ కండబలం, ధైర్యమైన షాట్లు భవిష్యత్తులో భారత క్రికెట్‌కు మరింత బలం చేకూర్చనున్నాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆసీస్ ఓటమికి కోహ్లీయే కారణమా?

## పాట్ కమ్మిన్స్ సంచలన వ్యాఖ్యలు




2026 టీ20 ప్రపంచకప్‌లో హాట్ ఫేవరెట్‌గా కనిపించిన ఆస్ట్రేలియా జట్టు గ్రూప్ దశలోనే ఓటమి పాలవ్వడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యంలో మునిగించింది. ముఖ్యంగా జింబాబ్వేతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఎదురైన పరాజయం ఆసీస్ పతనానికి ప్రధాన కారణమైంది. ఈ సందర్భంలో ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ పాట్ కమ్మిన్స్ ప్రసిద్ధి చెందిన సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నప్పటికీ, మాకు విరాట్ కోహ్లీ లేని స్థితి ఆ ఓటమికి కారణమని ఆయన చెప్పారు. జింబాబ్వేతో ఆడిన మ్యాచ్‌లో చివరి ఓవర్లలో అత్యవసర ఇన్నింగ్స్ ఆడగలిగే బ్యాటర్ లేకపోవడం వల్లే జట్టు పరాజయం పాలవ్విందని కమ్మిన్స్ వివరించారు. కోహ్లీ క్రీజులో ఉంటే ప్రత్యర్థి జట్టులో భయం ఏర్పడుతుందని, 37 ఏళ్ల వయసులో కూడా అతడి ఫిట్నెస్, ఆట పట్ల అంకితభావం అద్భుతమని ఆయన కొనియాడారు. కేవలం బ్యాటింగ్ సామర్థ్యమే కాకుండా, ఫిట్నెస్, ఆట పట్ల అంకితభావం కూడా యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకమని పాట్ కమ్మిన్స్ అభిప్రాయపడ్డారు.

# సూపర్-8 ఫార్మాట్ విషయంలో ఐసీసీపై విమర్శలు

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 ఫార్మాట్‌పై క్రీడా వర్గాల్లో విపరీతమైన చర్చ కొనసాగుతోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రవేశపెట్టిన ప్రీ-సీడింగ్ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుతంగా ప్రదర్శన ఇచ్చిన టాపర్ జట్లకు అన్యాయం జరుగుతుందని క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ఏ టోర్నీలోనైనా గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత టాప్‌లో నిలిచిన జట్లకు తదుపరి రౌండ్లో కాస్త ఉపశమనం ఇచ్చేలా సీడింగ్ విధానం ఉంటుంది. కానీ ఈసారి ఐసీసీ టోర్నీ ప్రారంభం కాకముందే ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. టోర్నీ ప్రారంభం కాకముందే సీడింగ్ వేయడం ప్రీ-సీడింగ్(జూతీవ-ంవవసఱఅస్త్ర) అని పిలవబడుతుంది. దీని అర్థం ఏదంటే ఒక జట్టు తన గ్రూపులో మొదటి లేదా రెండో స్థానంలో నిలిచినా ముందుగా నిర్ణయించిన స్లాట్‌లోనే ఉంటుంది. ఈ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భారత్, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే జట్లు ఒకే గ్రూపులో ఉండడం వల్ల రెండు జట్లు సెమీస్‌కు చేరకపోవాల్సి వస్తోంది. అదే సమయంలో రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లకు సెమీస్ చేరడం సులభమవుతుంది. దీనివల్ల టాపర్లుగా నిలిచిన జట్లకు అన్యాయం జరిగిందని, ప్రతిభను గౌరవించేలా లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐసీసీ స్పందనలో, భారత్, శ్రీలంక సంయుక్తంగా టోర్నీ నిర్వహిస్తున్నందున రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌లకు ముందుగానే ప్లాన్ చేసుకోవడం కోసం ప్రీ-సీడింగ్ విధానం తీసుకున్నామని, అభిమానులు, మీడియా కోసం సౌకర్యాన్ని కల్పించడమే ఉద్దేశమని తెలిపింది.



# నాలాంటి వాళ్లు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు..

## పూజా హెగ్డే

అందాల బుట్టబొమ్మగా గుర్తింపు పొందిన పూజా హెగ్డే గత కొంతకాలంగా వరుస సినిమాల్లో నటిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం అందుకోలేకపోతున్నారు. టాలీవుడ్‌లో అగ్ర హీరోలైన అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, ప్రభాస్, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ తదితరులతో స్క్రీన్ షేర్ చేసుకున్న ఆమెకు ఇప్పుడు తెలుగులో అవకాశాలు తగ్గినట్లుగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఒక్క తెలుగు సినిమాలో కూడా కనిపించని పూజా, ఇటీవల సూర్య హీరోగా నటించిన రెట్రో చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఆశించినంతగా ఆకట్టుకోలేకపోయింది. అంతకుముందు ఆమె నటించిన రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, సిర్కస్, కిసీ కా భాయ్ కిసీ కి జాన్, దేవా వంటి చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. వరుసగా ఫ్లాప్‌లు ఎదురైనా ఆమెకు అవకాశాలు మాత్రం వస్తూనే ఉండటం గమనార్హం. ప్రస్తుతం విజయ్ హీరోగా తెరకెక్కుతున్న జననాయగన్ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన పూజా హెగ్డే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ మధ్య కాలంలో నేను చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరుస్తున్నాయి. కొంతకాలంగా నా జీవితంలో 'విజయం' అనే పదానికి అర్థం మారిపోయింది. కానీ ఈ దశ కూడా నాకు చాలా ముఖ్యమైనది," అని తెలిపారు. అలాగే, "భవిష్యత్తులో నేను చేసే సినిమాలు నేను ఎలాంటి నటిని అనేది ప్రేక్షకులకు చూపిస్తాయి. సినీ బ్యాగ్రౌండ్ నుంచి వచ్చిన నాలాంటి వాళ్లు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు. వాళ్లు ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేను ఈ స్థాయిలో ఉన్నా కూడా ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. ప్రతి ఒక్కరి జీవితంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. మేము నటులం కాబట్టి ఫ్లాప్‌లను కూడా స్వీకరించాలి," అంటూ ఆమె స్పష్టం చేశారు. పూజా హెగ్డే మళ్లీ విజయాల బాట పట్టాలనే ఆశతో ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com